నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈనెల 7 సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా కలెక్టరేట్లోని గోదావరి భవన్ లో నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలన్నారు. జిల్లా స్థాయితో పాటు డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయి లో కూడా ఈకార్యక్రమం నిర్వహిస్తారన్నారు. డివిజన్ స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాలలో జరుగుతాయని డివిజనల్ స్థాయి అధికారులు అంతా సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయాలలో పాల్గొంటారన్నారు. మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సంబంధిత మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహిస్తారని అన్నారు.

వరి కోతలు ప్రారంభం

హార్వెస్టర్లతో ప్రారంభమైన పనులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పెట్టుబడులకు వెనకాడ కుండా రైతులు దాళ్వా వరి పంట పండించి వరి కోతలు ప్రారంభించారు. ఇది ఏడాది ఇప్పటివరకు వాతావరణం రైతులకు అనుకూలించడంతో పంటలు ఆశాజనకంగా పండాయి. అధిక శాతం మంది రైతులు బొండాలు వరి రకాన్ని 90 శాతం నాట్లు వేశారు. రైతన్నలు ఆరుగాలు పండించిన పంట చేతికి వచ్చే సమయంలో వాతావరణం ఒక్కసారిగా మార్పు చెందింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు కురవడంతో పాటు ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో రైతులు ఈ ఏడాది వాతావరణ అనుకూలిస్తుందో లేదా అని కొంత ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ముందు నాట్లు వేసిన రైతులు కోతలను ప్రారంభించారు. అయితే సాంప్రదాయ వరి కోతలకు రైతులు తిలోదకాలు ఇచ్చారు. మొత్తం అంతా హార్వెస్టర్లతో వరి కోతలు కోయడం వల్ల సమయంతో పాటు మరోవైపు ఖర్చులు ఆదాఅవుతాయని రైతులు అంచనా వేస్తున్నారు. సాంప్రదాయ వరి కోతల్లో కోత కోసిన తర్వాత పనులు ఆరబెట్టాలి. అనంతరం కట్టేలుగా కట్టి మోపులను కుప్పలుగా వెయ్యాలి. ఆ తర్వాత కుప్పలు ట్రాక్టర్లతో నూర్పాలి. నూర్పిన ధాన్యాన్ని తూర్పారబట్టాలి. ఆ తర్వాత ధాన్యాన్ని ఎండబెట్టి దానిని గోనె సంచులలోభద్రపరచాలి. ఇది చాలా సమయం వధా కావడమే కాకుండా అధికంగా రైతులకు పెట్టుబడులు పెరుగుతాయి. దీంతో పాటుగా వేసవిలో పనిచేసేందుకు కూలీలు కూడా దొరకని పరిస్థితి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో హార్వెస్టర్లను పెద్ద ఎత్తున గోదావరి జిల్లాలో దిగుమతి చేసి కోతలు ప్రారంభిస్తున్నారు. దీనివల్ల కోతలు కుప్పలు వేయడం మూర్పిడి వంటి పనులకు స్వస్తి పలుకుతున్నారు. హార్వెస్టర్ వల్ల వరి కోతలు కోయడంతో ఒకేసారి ధాన్యం చేతికి వస్తుంది. చేతికి వచ్చిన ధాన్యం రైతులు ఆరబెట్టుకుని వెంటనే అమ్ముకునే అవకాశం ఉంది. దీనివల్ల పంట చేలలో వరిని ఎక్కువ రోజులు ఉంచాల్సిన అవసరం లేదు. అన్ని విధాల అనుకూలంగా ఉండటంతో రైతులు నూటికి 90 శాతం మంది సాంప్రదాయ కోతలకు స్వస్తిపలికి ఆధునిక యంత్రాలైన హార్వెస్టర్లతో వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్నారు. కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలంలో సుమారు 45 వేల ఎకరాల్లో వరి పంట నాట్లు వేశారు. ప్రస్తుతం ముందుగా కోతగా సిద్ధమైన పంటలను రైతులు కోతలు ప్రారంభించారు.

హార్వెస్టర్ సాయంతో వరి కోత

కోతలు పూర్తయిన వెంటనే అపరాలు వేసుకోవాలి

దాళ్వా వరి పంట కోతలు పూర్తయిన వెంటనే రైతులు పంట పొలాల్లో అపరాలు చల్లుకోవాలని మండల వ్యవసాయ అధికారి బలుసు రవి తెలిపారు. రైతులకు సబ్సిడీ ధరకు పెసర, జనుము, పిల్లి పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. అపరాలు చదవడం వల్ల వరి పొలాలు సారవంతం అవుతాయని రైతులు తప్పనిసరిగా సబ్సిడీ విత్తనాలను వినియోగించుకుని వరి చేలలో అపరాలు చల్లుకోవాలని ఆయన సూచించారు.

హార్వెస్టర్లతో రైతులకు లాభసాటిగా ఉంటుంది

సాంప్రదాయ వరి కోతల వల్ల సమయం, ఖర్చులు అధికమవుతున్నాయని రైతులు హార్వెస్టర్లు ఉపయోగించడం వల్ల సమయం కలిసి రావడమే కాకుండా, కూలి పనులు ఖర్చులు తగ్గుతాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలు కూలి పనులకు ఎవరు రావడంలేదని, దీంతో పాటుగా కూలి రేట్లు రూ.1000 వరకు పెరిగాయి. పెట్టుబడులు పెరగడంతో రైతులు మిగిలేదేమి ఉండడం లేదు. ఈ పరిస్థితుల్లో హార్వెస్టర్లతో కోతలు కోయడం లాభ సాటి గా ఉంటుంది.

-కోలా నాగేశ్వరరావు, రైతు, ఎర్ర పోతవరం

గతంలో కోసే సాంప్రదాయ వరి కోతలు (ఫైల్)

మారిన వాతావరణంతో ఆందోళన

ప్రతీ ఏటా దాళ్వా పంట చేతికి వచ్చే సమాయానికి వర్షాలు, తుఫాన్లు రైతులను నష్టాలు బాట పట్టిస్తున్నాయి. వాతావరణం ఇప్పటివరకు రైతులకు అనుకూలించడంతో మంచి పంటలు పండాయి. రెండు రోజులుగా వాతావరణం మార్పు చెంది అకాల వర్షాలు కురవడంతో రైతులకు ఆందోళన చెందుతున్నారు. మే నెలాఖరుకు వరి కోతలు పూర్తవుతాయి. ఈ సమయంలో వాతావరణం అనుకూలిస్తే రైతులకు మేలు జరుగుతుంది. లేదంటే నష్టాలు చవి చూడాలి. పంటలు ఆశ జనకంగా ఉన్నాయి.

-బలుసు సత్యనారాయణ, రైతు, శివల

విజ్ఞానాన్ని పెంపొందించేందుకే విద్యా యాత్రలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విద్యా యాత్రలు దోహదం చేస్తాయని డాక్టర్ బి ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రమణ్యం పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల విద్యా యాత్ర ఆదివారం ముగిసిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాత్రలో విద్యార్థుల విద్యా విజ్ఞాన అభివృద్ధికి దోహదపడేలా రూపొందించిన యాత్ర విద్యార్థుల జీవితంలో మరిచిపోలేని అనుభూతిని పొందారన్నారు. దీనిలో ముఖ్యంగా యానం బొటానికల్ గార్డెన్, జిప్మర్ మెడికల్ కళాశాలలో వైద్య విద్య వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. అలాగే ఏటికొప్పాక బొమ్మల పరిశ్రమలో చెక్క బొమ్మల తయారీ, మిషనరీ పద్ధతులు, సాంప్రదాయ కళా రూపాల గురించి ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు. అదే విధంగా విశాఖలోని రుషికొండ బీచ్, తొట్లకొండ బౌద్ధారామాలు, రామానాయుడు స్టూడియో, భీమిలి బీచ్, హిల్ వ్యూపాయింట్‌లలో చారిత్రక, భౌగోళిక విశేషాలను అధ్యయనం లపై విపులంగా వివరించారన్నారు. హేరియర్ మ్యూజియంలో నావిగేషన్, పాత యుద్ధ విమానాలు, వాతావరణ శాస్త్రం, వన్యప్రాణుల నమూనాలు వంటి అంశాలను వివరించడమే కాకుండా, చారిత్రక అంశాలను, సైన్స్ ను కొత్త కోణాల్లో ఆలోచించే విధానాన్ని, నావెల్ మ్యూజియం, సబ్‌మెరిన్ మ్యూజియం, టి-142 యుద్ధ విమాన మ్యూజియంలను సందర్శించి, భారత రక్షణ రంగంలోని విశిష్టతలను విద్యార్థులు తెలుసుకున్నారని అన్నారు. యాత్ర విజయవంతం కావడానికి సహకరించిన డిఇఒ డాక్టర్ ఎస్‌కె.సలీం భాషా, విశాఖ నగర మున్సిపల్ కమిషనర్ విశ్వనాథం లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ యాత్రలో అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ పిల్లి రాంబాబు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం

ప్రమాదకరంగా రహదారి వంతెన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం నుంచి మాచర వెళ్లే గ్రామ శివారులో ని పంట కాలువ పై నిర్మించిన రహదారి వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి మలుపులో ఉన్న ఈ వంతెనకు రక్షణ గోడ కుడి, ఎడమ వైపు రక్షణ గోడ కూలింది. రహదారి పక్కన ఏర్పడిన గుంతలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు, రైతులకు, భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ వంతెన మలుపు తిరిగే క్రమంలో ఆదమరచి పక్కకు వెళితే పంట కాలువలోకి వాహనాలతోపాటు బాటసారులు పడిపోయే ప్రమాదం ఏర్పడుతుంది . ఈ వంతెన మలుపు తిరిగే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందో అని తెలియని పరిస్థితి. ఈ వంతెన రహదారి మలుపు మీదుగా కపిలేశ్వరపురం నుంచి శ్రీరాంపురం, మాచరమట్టలు, మాచర, టేకి, కోరుమిల్లి, వెళ్లే గ్రామాల ప్రజలు ప్రతినిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రైతులు పంట పొలాలకు వెళ్లాలన్న ఈ రహదారి మీదుగానే వెళ్లాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ మలుపులో ఉన్న వంతెన కు రక్షణ గోడ పటిష్టంగా నిర్మించాలని ,రహదారి మలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామస్థులతో పాటు ప్రయాణికులు, వాహనదారులు, రైతులు, కోరుతున్నారు .

కపిలేశ్వరపురం నుంచి మాచర వెళ్లే మలుపులో విరిగిన రక్షణ గోడలు

వెంకన్న కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాలు సోమవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. కళ్యాణ వేదిక వద్ద ప్రత్యే పుష్పాలంకరణ ఏర్పాటు చేయుట, దేవాలయ ప్రాంగణమంతా పుష్పాలంకరణ, ఈ కళ్యాణోత్సవాన్ని యాత్రికులు వీక్షించే విధముగా కళ్యాణ మండపాన్ని విశాలమైన ప్రదేశంలో ఏర్పాటుచేయుట, ప్రాంగణ మంతా విద్యుత్ అలంకరణాలతో కళ్యాణ శోభ ఉట్టిపడే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశామని ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరరావు ఆదివారం తెలియజేశారు. కళ్యాణోత్సవాన్ని సుమారు 20 వేల మంది కూర్చొని వీక్షించే విధముగా ఏర్పాట్లు చేశారు. రథోత్సవం ఏర్పాట్లు: 1931లో కళ్యాణోత్సవంలో ఆగిపోయిన రథోత్సవం 2016 నుంచి తిరిగి ప్రారంభించారు. సోమవారం అంకురార్పణతో కళ్యాణోత్సవాలు ప్రారంభమవుతాయి. మంగళవారం స్వామివారి తీర్థం, రథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవ కార్యక్రమంలో వేల సంఖ్యలో యాత్రికులు పాల్గొంటారని ఆలయ అధికారులు అంచనా వేసి ఏర్పాట్లు చేశారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు నిర్వహిస్తున్నారు. తెప్పోత్సవం కార్యక్రమం11న రాత్రి 8 గంటలకు గౌతమి గోదావరి నదిలో నిర్వహించనున్నారు. దీనికోసం సుమారు 10 పడవలలో హంస వాహనంలో స్వామి వారు గౌతమీ గోదావరి నదిలో విహరిస్తారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గజ ఈతగాలను ఏర్పాటు చేశారు. స్వామివారి చక్రస్నానం శనివారం రావడం వల్ల యాత్రికుల రద్దీ దృష్ట్యా చక్రస్నానం జరిగే గోదావరి రేవుల నందు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు పోలీసు, నీటిపారుదల శాఖల వారిచే ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం లక్ష పైబడి యాత్రికులు స్వామివారిని దర్శించుకుని చక్ర స్నానం పాల్గొంటారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పుష్పోత్సవం రోజున శ్రీ స్వామి వారికీ ప్రత్యేకమైన అలంకరణతో స్వామి వారు యాత్రికులకు దర్శనమిస్తారు. యాత్రికుల వాహనాల కోసం దేవస్థానానికి చెందిన 6 ఎకరాల స్థలాన్ని ఏర్పాటు చేశారు . ప్రయాణీకుల రద్దీకి తగిన బస్ లను వివిధ డిపోల నుంచి బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు . వాడపల్లి గ్రామపంచాయతీ, దేవస్థానం పారిశుధ్య విభాగం, అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. 24 గంటలు పర్యవేక్షణ చేస్తూ, మాడ వీధులు, పార్కింగు, వాడపల్లి గ్రామమంతయూ పారిశుధ్యం నిర్వహిం చుటకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసినట్లు పంచాయతీ విస్తరణ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ప్రస్తుతం వున్న బాత్ రూములకు తాత్కాలిక బయో టాయిలెట్లు ఏర్పాటు చేయడం చేశామన్నారు. యాత్రికులకు అసౌకర్యం కలుగకుండా ఎప్పటికప్పుడు విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం సరాఫరా అయ్యే విధంగా ఎపి ఎస్ఇబి సహకారంతో, దేవస్థానం వారిచే ప్రత్యేకమైన జనరేటర్లను ఏర్పాటు చేసినట్లు ఎలక్ట్రికల్ ఎఇ తెలిపారు.

పిచ్చుకలంక వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పిచ్చుకలంక వద్ద ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. మండలంలోని బొబ్బర్లంక పిచ్చుకలంక వద్ద గౌతమి గోదావరి నదిలో స్నానాలు చేస్తూ ప్రమాదవశాస్తు పలువురు ప్రమాదవశాస్తు గోదావరిలో గల్లంతే మతి చెందుతున్నారు. దీని దష్ట్యా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఆదివారం పిచిక లంక అన్నపూర్ణ దేవి గుడి వద్ద స్నానాలకి వచ్చిన వారిని వెనక్కి పంపించేశారు. అక్కడ జరిగే ప్రమాదాల గురించి వారికి తెలియజేశారు. అలాగే ఎవరూ కూడా గోదావరిలో దిగకుండా పోలీస్ పహారా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు..

పిచ్చుక లంక వద్ద పహార నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

అధికారుల హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలం కేదార్లంక ఇసుక ర్యాంపు సమీపంలో గోదావరి నదిలో శనివారం స్నానానికి దిగిన రొట్టా దుర్గాప్రసాద్ (21) మృతి చెందాడు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ కొత్తపేటకు చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు, మృతదేహం వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండపేట రూరల్ సిఐ దొర రాజు ఆధ్వర్యంలో అంగర ఎస్ ఐ రవికుమార్, రెవెన్యూ అధికారులు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. మృతిని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మతిని తండ్రి రొట్టా శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అంగర ఎస్ రవికుమార్ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రి కి తరలించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మాంసం విక్రయ వ్యాపారం చేస్తూ జీవించే మృతిని తండ్రి రొట్టా శ్రీనివాస్‌కు కుమార్తె, కుమారుడు, ఉన్నారు. కుమారుడు దుర్గాప్రసాద్ చిన్న వయసులోనే మరణించడంపై పట్ల కుటుంబీకులు, బంధువులు, కన్నీరు మున్నీరు గా విలపిస్తున్నారు.

విలసవిల్లిలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని విలసవిల్లి శివాలయం కాలనీలో ఆదివారం రూ.నాలుగు లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపిటిసి సభ్యురాలు సలాది సురేఖారాణి, అజీజ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి సభ్యురాలు సురేఖారాణి మాట్లాడుతూ ఇప్పటివరకు కాలనీలో రోడ్డు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. సిసి రోడ్డు నిర్మాణంతో వారి ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంటు ఫణి ప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యులు కాసిన సత్యనారాయణ, టిడిపి, నసేన గ్రామ కమిటీల అధ్యక్షులు నందుల సత్తిరాజు, అత్తిలి రాము, సాగునీటిసంఘం అధ్యక్షులు బండారు సాయిబాబు, నాగిరెడ్డి సత్తిబాబు, కరాటం నాగు, సలాది స్వామి నాయుడు, అత్తిలి సురేష్, పిచ్చిక భూషణం, దేవనాస్ నాయుడు, కె.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎం పిటిసి సభ్యురాలు సురేఖా రాణి

గోతులయంగా వెదురుమూడి-కొత్తూరు రహదారి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిధి వెదురుమూడి నుంచి కొత్తూరు సెంటర్ వెళ్లాలంటే ఆఅండ్‌బి రహదారి గుంతలతో ప్రమాదకరంగామారింది. ఈ రహదారి పై ప్రయాణాలు చేయాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతితో పెట్టుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది . ప్రతీ రోజు రద్దీగా ఉండే ఈ రహదారి మీదుగా పాఠశాలకు వెళ్లే వాహనాలు ద్విచక్ర వాహన దారులు వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రహదారి లో మలుపు ఉండడం ఆ మలుపు సమీపంలో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని ప్రజలు స్థానికలు వాపోతున్నారు . ఈ రహదారి మీదుగా విద్యార్థులు సైకిల్ పై పాఠశాలకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు అలాగే వాహనదారులు భయంగా ఉన్న గుంతలు రోడ్డు దాటితే చాలు అనే పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు మీదిగా కొత్తూరు జొన్నాడ రావులపాలెం, మండపేట , తదితర గ్రామాలకు వెళ్లాలంటే ప్రతి నిత్యం ఈ రహదారి మీదుగా ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఎంతో రద్దీగా ఉంటున్న రహదారిపై ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు గుంతలు ఏర్పడిన ప్రదేశాల్లో మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, వాహనదారులు, ప్రయాణికులు ,ప్రజలు స్థానికులు కోరుతున్నారు.

వెదురుమూడి మలుపు వద్ద రహదారిపై గోతులు

కార్టూ'నిజం'

వైద్యం కోసం రూ.26 వేల సాయం

ప్రజాశక్తి - అల్లవరం

కిడ్నీ బాధితునికి ట్రూత్ హెల్పింగ్ ఫౌండేషన్ కువైట్ ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. గుండెపూడి పోతులవారి పేట కు చెందిన నీతిపూడి సురేష్ కు రెండు కిడ్నీలు అనారోగ్యానికి గురై ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ట్రూత్ హెల్పింగ్ ఫౌండేషన్ కువైట్ ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యులు మోక రాజు, కారుపల్లి సత్యనారాయణ, కలగట శ్రీధర్, నేలపూడి హానుక్, జాలెం కిరణ్, నేల రాంబాబు, గెడ్డం దుర్గప్రసాద్, భీమారావు, బుడితి గాబ్రియేల్ కిడ్నీ బాధితుడు సురేష్ వైద్యానికి ఆర్థిక సాయం చేశారు. దేవగుప్తం సర్పంచ్ సాధనాల వెంకటరావు, సాధనాల శ్రీను రూ.26,110 బాధితునికి అందించారు. ట్రూత్ హెల్పింగ్ ఫౌండేషన్ కువైట్ ఎన్ఆర్ఐ గ్రూపు సభ్యులందరికీ బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సాధనాల శ్రీను, ఎంపిటిసి సభ్యులు మాకే కృష్ణమూర్తి, ఈతకోట సతీష్, రొక్కల రాంబాబు, బాబ్జీ, కలగట మహేష్, ఈతకోట రాజు వడ్డీ సత్యనారాయణ, ముత్తా బత్తుల దైవ సంకల్పన రావు, కలగట రాంబాబు, పోతుల సత్యనారాయణ, పోతుల రఘు, పినిపే ప్రకాష్, బడుగు రాంబాబు, మధు, గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయంఅందిస్తున్న ట్రూత్ హెల్పింగ్ ఫౌండేషన్ కువైట్ ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యులు

బిసిలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

బిసి లకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం బిఎస్‌పి ఇన్ ఛార్జ్ పొలమూరి మోహన్ బాబు డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద ఈనెల 11న చేపట్టే నిరసన కార్యక్రమాన్ని బిసి కులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని చేయాలని కోరారు. ఇందులో భాగంగా ఆదివారం ఉప్పలగుప్తం లోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బిసి సమరభేరి గోడ పత్రికను మోహన్ బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిసి నాయకులు చప్పిడి దుర్గారావు, శీలం భాస్కరరావు, గుత్తుల సూర్య, రాయుడు రమేష్, నామాడి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి బాల శ్రీను, బిఎస్‌పి మండల అధ్యక్షులు పెయ్యల ప్రతాప్ కుమార్, నాయకులు తాళ్ల బాబ్జి, జనిపెల్ల రవీందర్, పందిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమరభేరి గోడపత్రికను ఆవిష్కరిస్తున్న బిఎస్‌పి ఇన్‌ఛార్జి మోహన్‌బాబు

నేరాలు ఘోరాలు

డ్రోన్‌ను చూసి పరారవుతున్న నిందితుడు

డ్రోన్ సాయం పేకాడుతున్న వారు అరెస్ట్

ప్రజాశక్తి-పెరవలి

డ్రోన్ సాయంతో పేకాడుతున్న వారిని అరెస్ట్ చేశారు పోలీసులు. వివరాలు ఇవి.. మండలంలోని కాపవరంలో పంట పొలాల మధ్య మామిడి చెట్ల కింద పేకాడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ యం. వెంకటేశ్వరరావు తమ సిబ్బంది సాయంతో అక్కడికి వెళ్లి అక్కడ నుంచి డ్రోన్ ఎగురవేశారు. పేకాడుతున్న వారు ఎటువైపు వెళ్తున్నారో గుర్తించి వారిని పట్టుకుని వారి వద్ద నుంచి నగదు రూ.4,010 స్వాధీనం చేసుకున్నారు. పేకాడుతున్నవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు

కె.గంగవరం పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్లు

ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల సీజ్

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని బట్లపాలిక, దొరువుపేట ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశామని కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా తెలిపారు. తమకు అందిన సమాచారం బట్టి శనివారం సాయంత్రం వాటిని పట్టుకున్నామన్నారు. ఇసుకను పోలీస్ స్టేషన్ వద్ద డంప్ చేయించి, టాక్టర్లను సీజ్ చేసి ఏ గంగవరం తహశీల్దార్ కార్యాలయం అప్పగించామన్నారు. దీనిపై విచారం చెప్పి తహశీల్దార్ ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధిస్తారని ఎస్ఐ వివరించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఎస్ఐ వివరించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం రాజుగారి గార్డెన్ ఫంక్షన్ హాలులో ఆదివారం వేమగిరి సునీల్ అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సీతానగరం మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన సునీల్ రాజుగారి గార్డెన్ రూంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఫంక్షన్ హాలు నిర్వాహకులు సునీల్ మతదేహాన్ని సీతానగరంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ సంఘటనపై సీతానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి డివిజన్ ఆర్గనైజర్ ప్రకాష్‌కు పిత్స వియోగం

ప్రజాశక్తి - అంబాజీపేట

చిన సత్యనారాయణ(ఫైల్)

ప్రజాశక్తి దిన పత్రిక కొత్తపేట డివిజన్ ఆర్గనైజర్ కొత్తపల్లి ప్రకాష్‌కు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి కొత్తపల్లి చిన సత్యనారాయణ (62) అమలాపురంలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. పలువురు నాయకులు, మిత్రులు, పాత్రికేయులు ప్రకాష్‌ను పరామర్శించారు. ఆయన మృతికి ప్రజాశక్తి దినపత్రిక రాజమండ్రి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, డెస్క్ ఇన్‌ఛార్జి ఎస్.విశ్వనాథ్, సమన్వయ కమిటీ సభ్యులు, సిబ్బంది సంతాపం తెలిపారు. సత్యనారాయణ అంత్యక్రియలు ఆదివారం ఆయన స్వగ్రామంలో నిర్వహించారు.

సిపిఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు పరామర్శ

పితృ వియోగంతో బాధ పడుతున్న ప్రకాష్‌ను సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పరామర్శించారు. ప్రకాష్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన సత్యనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రారంభానికి నోచుకోని సులభ్ కాంప్లెక్స్

ప్రజాశక్తి - కోటనందూరు

కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు సరిహద్దు ప్రాంతమైన కోటనందూరులో గత ప్రభుత్వంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటనందూరు, కాకరాపల్లి జంట గ్రామాలుగా ఉన్న ప్రధాన కూడలిలో ఆర్‌టిసి బస్సు షెల్టర్ ఉంది. ఆర్‌టిసి ప్రయాణికులకు, బాటసారులకు విద్యార్థులకు ద్విచక్ర వాహనదారులకు టాయిలెట్స్ లేకపోవడంతో వారి ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వంలో మండల పరిషత్ అభివృద్ధి నిధులతో మండల పరిషత్ అధ్యక్షుడు లగుడి శ్రీనివాస్ సుమారు రూ.6 లక్షల నిధులు వెచ్చించి సులభ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఇప్పటికన్నా ఉన్నతాధికారులు స్పందించి సులభ్ కాంప్లెక్స్ ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

కోటనందూరులో ప్రారంభం కాని సులభ్ కాంప్లెక్స్

తోటల పెంపకంలో జిల్లాకు ప్రథమ స్థానం

డ్వామా పీడి ఎ. నాగమహేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తోటల పెంపకంలో జిల్లాకు ప్రథమ స్థానం లభించింది. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు పని దినాలు 11,754 కుటుంబా లకు కల్పించి లేబర్ బడ్జెట్ 102.07 శాతంతో రాష్ట్రంలో 06వ స్థానంలో తూర్పు గోదావరి జిల్లా నిలిచిందని డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు తెలిపారు.

జిల్లాలో ఎంత మంది ఉపాధి కూలీలు ఉన్నారు..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని 1,00,247 కుటుంబాలలోని 1,32,954 మంది ఉపాధి హామీ కూలీలకు 51,88,790 పని దినాలు కల్పించాము. తద్వారా ఉపాధి హామీ కూలీలకు రూ.131 కోట్ల మేర వేతనాల రూపంలో చెల్లించాము. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద ఎస్‌సి కుటుంబాలకు 18.67 లక్షల పని దినాలు, ఎస్‌సి కుటుంబాలకు 1.02 లక్షల పని దినాలను కల్పించాము. ఒక్కొక్క పని దినానికి సగటున రోజువారీ వేతనం రూ.255 చొప్పున చెల్లించాము. ప్రస్తుతం 2025-26 ఆర్థిక సంవత్సరంలో సగటు దినసరి వేతనం రూ.290 నుంచి రూ.300 పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నాము.

జిల్లాకు వివిధ కేటగిరీలలో వచ్చిన స్థానం ఏమిటి..

జిల్లాలో 149.50 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లను రూ.72 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం పూర్తి చేశాము. సిమెంట్ రోడ్ల నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. అదే విధంగా పాడి రైతులకు సంబంధించి 583 పశువుల షెడ్లను రూ.09.85 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి చేయించాము. పశువుల షెడ్ల నిర్మాణంలో రాష్ట్రంలో 07వ స్థానం లభించింది. జిల్లాలోని 373 మంది సన్న, చిన్న కారు రైతులకు 643.50 ఎకరాలలో రూ.87.90 లక్షల వ్యయంతో పండ్ల తోటల పెంపకం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాము. పండ్ల తోటల పెంపకంలో రాష్ట్రంలోనే తూర్పు గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.

2025-26లో కార్యాచరణ ప్రణాళిక ఏమిటి..

2025-26 ఆర్థిక సంవత్సరం కార్యాచరణలో భాగంగా పంచ ప్రాధాన్యాలు ఇచ్చాము. మొదటిగా పని దినాల కల్పన, రూ.300 వేతనం, ఏప్రియల్, మే, జూన్ నెలలో తూర్పు గోదావరి జిల్లాలోని ఉపాధి హామీ కూలీలకు 35 లక్షల పని దినాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి పని దినానికీ సగటు వేతనం రూ.300 పొందే విధంగా మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు కొలతలపై అవగాహన కల్పించాము.

నీటి తొట్టెలు, ఫారం పాండ్ల నిర్మాణంపై చర్యలు ఏమిటి..

వేసవిలో పశువులకు నీటి సదుపాయం కల్పించేందుకు జిల్లాలో పశు సంవర్ధక శాఖ గుర్తించిన 157 ప్రదేశాల్లో ఒక్కొక్కటి రూ.33,000తో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకం నిధులతో చేపట్టేందుకు నిర్ణయించాము. ఈ పశువుల నీటి తొట్టెలను ఏప్రియల్ 10వ తేదీ లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నాము. జిల్లాలోని సన్న, చిన్న కారు రైతుల పొలాల్లో 1500 ఫారం పాండ్లు (సాగునీటి నీటికుంటలు)లు ఉపాధి హామీ నిధులతో చేపట్టేకుందుకు లక్ష్యం నిర్ధేశించాము. ఈ ఫారం పాండ్ల నిర్మాణం ద్వారా రైతులకు నీటి లభ్యత మెరుగుపడుతుంది. రానున్న మూడు నెలల కాలంలో 1500 సాగునీటి చెరువులు పూర్తి చేసేందుకు జిల్లాలోని 9 మండలాలకు లక్ష్యాలను నిర్ధేశించాము.

పంటకాలువలు, చెరువుల పూడిక పనులపై లక్ష్యాలు ఏమిటి..

జిల్లాల్లోని డెల్టా మండలములకు సంబంధించిన పంట కాలువలు, మైనర్ మరియు మేజర్ కాలువలో పూడికతీయుటను ఈ మూడు నెలల కాలములో జిల్లాలోని 2500 కిలోమీటర్ల పంటకాలువలో పూడిక తీయుటకు లక్ష్యంగా నిర్ధేశించుకున్నాము. దాళ్వా వరి పంట కోతలు పూర్తి కాగానే పూడిక తీత పనులు ప్రారంభించి, కాలువలకు నీరు వదిలే సమయానికి పూర్తి చేస్తాము. ఈ మూడు నెలల కాలంలో అన్ని మండలాల్లోనూ కలిపి 392 చెరువులలో పూడిక తీసేందుకు ఇప్పటికే పరిపాలన ఆమోదం మంజూరు చేశాము. జూన్ నెలలో వర్షాలు పడే నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసే విధంగా లక్ష్యాలను నిర్ధేశించుకున్నాము. ఏప్రిల్, మే, జూన్‌లలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని అన్ని మండలాల్లోని ఉపాధి హామీ సిబ్బందిని సమాయాత్తం చేశాము. లక్ష్యం మేరకు ఈ పనులను పూర్తి చేయడం ద్వారా జిల్లాలో ఉపాధీ హామీ వేతనదారులకు పని కల్పిస్తున్నాము.

శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనుల ప్రణాళిక ఏమిటి..

జిల్లాలోని శ్మశానవాటికలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని గుర్తించి ప్రత్యేక ప్రాధాన్యతా కార్యక్రమంగా చేపట్టేందుకు అక్టోబర్ 2024 లో ప్రతిపాదనలు పంపాము. 2025-26 ఆర్థిక సంవత్సరం శ్మశాన వాటికలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం వారి నుంచి అనుమతి లభించింది. మండలానికి మూడు చొప్పన ప్రతిపాదనలు వచ్చినవి. ఈ పనులను ఒకొక్క శ్మశాన వాటికకు సుమారు రూ.15.00 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నాము.

పిహెచ్‌సిలో సమస్యల నిలయం

-ఉపయోగం లేని ఆపరేషన్ థియేటర్

-మూలన పడ్డ పరికరాలు

ప్రజాశక్తి - కరప

కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్‌సి) సమస్యలకు నిలయంగా మారింది. ఈ పిహెచ్‌సికి గతమెంతో ఘన చరిత్ర ఉన్నా నేడు కనీస సౌకర్యాలు లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. శిథిలావస్థలో ఉన్న భవనం స్థానే నూతన భవనం నిర్మించేందుకు 2017లో నాటి ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఎన్‌హెచ్‌ఎం నిధుల నుంచి రూ.118 లక్షలతో 2018లో నూతన భవనాన్ని నిర్మించారు. అయితే వైద్య సేవలు మాత్రం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. 3 నెలల క్రితం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ నాయక్ వేళంగి పిహెచ్‌సికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డాక్టర్ బి.ఏంజలీనా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆమె జూనియర్ డాక్టర్ కావడంతో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పిహెచ్‌సికి ప్రతీ రోజు వందకు పైగా ఔట్ పేషెంట్స్ వస్తున్నారు. వీరికి అదనంగా గర్భిణులు పెద్ద సంఖ్యలోనే వైద్య సేవల నిమిత్తం వస్తున్నారు. జనవరి నెలలో 52 మంది గర్భిణులు వైద్య సేవలకు రాగా, వీరిలో 20 మంది నిత్యం డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాల్సిన వారు వచ్చారు. ఫిబ్రవరి 44 మంది రాగా, వీరిలో 17 మందికి అత్యవసర సేవలు అవసరం అయ్యాయి. ఇక మార్చి నెలలో 44 ఆసుపత్రికి రాగా, వీరిలో 16కి అత్యవసర వైద్య సేవల కోసం వచ్చారు. అయితే ఇక్కడ సీనియర్ గైనకాలజిస్టు లేకపోవడంతో అత్యవసర వైద్య సేవల కోసం వచ్చిన వారు కాకినాడ జిజిహెచ్‌కు, ఇతర ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందారు. వైద్యశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో పిహెచ్‌సి నిర్వాహణ అస్తవ్యస్తంగా మారింది. ఆసుపత్రిలో డెలివరీ కేసులు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు ఇక్కడ నోచుకోవడం లేదు.

మూలన పడ్డ పరికరాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్ పిహెచ్‌సిని సందర్శించి సమస్యలను గుర్తించారు. సమస్యల పరిష్కారం కోసం ఒక నివేదికను రూపొందించి ఎంఎల్‌ఎ పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎల్‌ఎ స్పందించి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సిఎస్‌ఆర్ నిధుల నుంచి ఆసుపత్రి అభివృద్ధికి సుమారు రూ.46 లక్షల విలువ చేసే పరికరాలను ఆసుపత్రికి సమకూర్చారు. అయితే ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన పరికరాలు వచ్చినా వాటిని వినియోగించేందుకు అవసరమైన సాంకేతిక సిబ్బంది లేకపోవడంతో ఆ పరికరాలు గత 3 నెలలుగా మూలన పడ్డాయి.

అన్న క్యాంటీన్లలో చాలీచాలని భోజనం

- అన్నం కావాలంటే మరో రూ.5 చెల్లించాలి
- అమలు కాని మెనూ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పేదవాడి ఆకలి తీర్చేందుకు నడుం బిగించిన టిడిని ప్రభుత్వం అన్న క్యాంటీన్ల పేరుతో రూ.5లకు భోజనం పథకాన్ని ప్రవేశపెట్టింది. పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి పార్టీ నాయకులతో అన్న క్యాంటీన్ ప్రారంభించారు. దీంతోపాటుగా క్యాంటీన్ల వద్ద మెనూ ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉంది ఇక ఆచరణ లోనికి వస్తే ఇక్కడ మెనూలో కూర, పప్పు, పచ్చడి, సాంబారు, పెరుగు వడ్డించాల్సి ఉంది. రోజుకు పగలు 400 మంది రాత్రి 200 మందికి భోజనాలు అన్న క్యాంటీన్లో



మెనూ చార్ట్

అందజేస్తున్నారు. అయితే ఇక్కడ వడ్డించేది మాత్రం చాలీ చాలని అన్నం, ఒక కూర, కొంచెం సాంబారు, మజ్జి గతో సరిపెడు తున్నారు. ఇది ఎవరికీ సరిపోవడం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ఈనెల5న అన్న క్యాంటీన్లో మెనూ ఆహార పదార్థాలను పరిశీలించింది. ఒక కప్పుతో వెలితిగా అన్నం వడ్డించి కొంచెం కూర కొంచెం సాంబార్ తో సరిపెడుతున్నారు. కొందరు మహిళలు మళ్లీ అన్నం కావాలని అడగ్గా మరో రూ.5 చెల్లించి అన్నం పెట్టించుకోవాలని నిర్వా హకులు సూచిస్తున్నారు. పేదలు మళ్లీ అన్నం కోసం మరో రూ.5 చెల్లిస్తు న్నారు. ఇక రిక్షా కార్మి కులు, వ్యవసాయదారులు అయితే మూడుసార్లు రూ.5 చొప్పున చెల్లించి ఆహారం తీసుకుంటే గాని సరిపోని పరిస్థితి నెలకొంది. రామచంద్రపురం అన్న క్యాంటీన్లో ఏర్పాటుచేసిన నోడల్ అధికారి శివను దీనిపై వివరణ కోరగా ప్రభుత్వం అందజేసిన గైడెన్స్ ప్రకారం అన్నం పెడుతున్నామని ఇది సరిపడగా ఉన్నప్పుడు ఆదనంగా మరో రూ.5 చెల్లించి వినియోగదారులు ఆహారం తీసుకుంటున్నారని దీనిని పై

భోజనం చేస్తున్న యువకులు

అధికారుల దష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అదే విధంగా మెనూ లో ఐదు రకాలు పెట్టవలసి ఉండగా కేవలం మూడు రకాల వడ్డిస్తున్నారు అన్న విషయాన్ని కూడా ఈయన పై అధికారుల దష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ప్రభుత్వం అట్టహాసంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లలో సరిపడా అన్నం పెట్టి పేదల కడుపు నింపాలని, కూరలు సాంబారు సరిపడగా వేయాలని, అరకొర ఆకలి కాకుండా పూర్తిగా ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం పార్టీ నాయకులు చర్యలు చేపట్టాలని అదనపు అన్నానికి మరో అయిదు చెల్లించకుండా చర్యలు చేపట్టాలని అన్న క్యాంటీన్లో భోజనానికి వచ్చిన పలువురు కోరుతున్నారు. పేదల కడుపులు నింపేందుకు ఏర్పాటు చేసిన ఈ పథకాన్ని చిత్త శుద్ధితో కొనసాగించి పేదలకు మరింత రుచికరమైన భోజనం అందించాలని అప్పుడే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

పట్టణంలో ఏర్పాటు చేసినఅన్న క్యాంటీన్ ఇదే

చింతలూరులో ట్రాఫిక్ జామ్

మూడు గంటల పాటు యాత్రికులకు అవస్థ

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరులో వేంచేసియున్న శ్రీనూకాంబిక అమ్మవారి తీర్థానికి వచ్చిన యాత్రికులతో పాటు భారీ వాహనాల రాకపోకల వల్ల విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అసలే ఇరుకు రోడ్డు కావడంతో పాటు బారీ వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగించడంతో కొత్తూరు నుంచి వెదురుమూడి రోడ్డులో రెండు కిలోమీటర్ల మేర మూడు గంటల పాటు ట్రాఫిక్ స్థంభించి పోయింది. దీనివల్ల చంటిపిల్లల తల్లులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు సుమారు మూడు గంటల పాటు అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ దుస్థితిపై స్పందించవలసిన దేవాదాయశాఖ, పోలీసుశాఖ ఆలస్యంగా స్పందించడంతో ప్రయాణీకులే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన యాత్రికలు వాహనాలను ఒక పద్ధతి ప్రకారం కాకుండా రోడ్డుకు ఇరువైపుల ఇష్టానుసారం పార్కింగ్ చేయడంతో ఈట్రాఫిక్ సమస్యకు కారణమైంది. చింతలూరు తీర్థంలోని ఏర్పాట్లను కేవలం మూడు రోజులకే పరిమితం చేసి అనంతరం భక్తుల సౌకర్యాల కల్పనను అధికారులు గాలికి వదిలే యడంతో ప్రతియేటా ఈపరిస్థితి సంభవిస్తుందని యాత్రికులు ఆరోపిస్తున్నారు. శ్రీనూకాంబిక అమ్మవారి తీర్థానికి సంబంధించి యాత్రికులు నెల రోజుల పాటు ప్రతి ఆది, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారని అధికారులకు తెలిసినా నిర్లక్ష్య ధోరణితో పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అత్యంత వ్యయ ప్రయాసలకోర్చి శ్రీనూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన యాత్రికులు పట్ల దేవదాయశాఖ పర్యవేక్షణలో ఇతర శాఖల అధికారులు నిర్వహిస్తున్న విధుల నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ జామ్ సమస్యపై పోలీసు స్టేషన్‌కు వినతులు వెల్లువెత్తడంతో ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ నేతృత్వంలో సిబ్బంది వచ్చి కొద్ది సమయం తరువాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

చింతలూరు నుంచి వెదురుమూడి వెళ్లే రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్

మెజీషియన్ ఆలీకి ఘన సన్మానం

ప్రజాశక్తి - మామిడికుదురు

కళారంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మామిడికుదురు మండలం నగరానికికు చెందిన ప్రముఖ మెజీషియన్ ఆలీకి హైదరాబాద్ లో ఉగాది పురస్కారం -2025 సంగమం ఫౌండేషన్ తరపున ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంగమం ఫౌండేషన్ అధ్యక్షుడు సంజయ్ కిషోర్, ప్రముఖ సినీ నటి వై.విజయ, నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు రేలంగి నరసింహారావుకలసి మెజీషియన్ ఆలీకి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పలువురు సాంస్కృతిక, కళారంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఫౌండేషన్ తరపున అధ్యక్షులు సంజయ్ కిషోర్ మాట్లాడుతూ సాంస్కృతిక, సినీ, కళారంగ అభివృద్ధికి తోడ్పడే వారిని గుర్తించి సత్కరించడం మా ధ్యేయమని అన్నారు. మెజీషియన్ అలీ మాయాజాల ప్రదర్శన, ప్రత్యేక మ్యాజిక్ షో ప్రేక్షకులను అబ్బురపరిచింది. అతని వినూత్న సాంకేతికత, ఫింగర్ మ్యాజిక్, కార్డ్ మానిప్యులేషన్ లాంటి కళాత్మక ప్రదర్శనలు సభికులను అలరించాయి.

ఉగాది పురస్కారం అందుకుంటున్న మెజిషియన్ ఆలీ

శ్మశాన అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పెంకేవారి పేట శ్మశాన వాటిక అభివృద్ధికి డైమండ్ గ్రూప్, లయన్స్ క్లబ్ సభ్యుడు పబ్బినీడి వెంకటరత్నకుమార్ రూ.3 లక్షలు విరాళం అందజేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ కైలాస భూమిగా అభివృద్ధి చేస్తున్న విషయం విధితమే. దీనిలోభాగంగా శ్మశానంలో రెండు దహన బెడ్లు నిర్మించేందుకు ఈ నిధులను వినియోగించాలని దాత తెలిపారు. విరాళాన్ని లయన్స్ క్లబ్ నిర్వాహకులు పొన్నాడ పేరయ్యరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నడింపల్లి వినోద్‌లకు అందించారు. ఈ సందర్భంగా కుమార్‌ను లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు.

దాతను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంఎల్‌సి రవీంద్రబాబు, ఎంఎల్‌ఎ ఆనందరావు

లబ్ధిదారులకు పేపర్ ప్లేట్ యంత్రం అందజేత

రూ.లక్ష విరాళం అందజేసిన ఎంఎల్‌సి రవీంద్రబాబు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎంఎల్‌సి డాక్టర్ పండుల రవీంద్ర బాబు రూ.లక్ష విరాళంతో పేపర్ ప్లేట్ యంత్రం సమకూర్చారు. ఈ యంత్రాన్ని మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ తరపున ఆదివారం అమలాపురం మండలం భట్నవిల్లి గ్రామంలో ఎంఎల్‌సి పండుల రవీంద్రబాబు, అమలాపురం ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ పుణ్యమంతుల రజిని అధ్యక్షతన పేపర్ ప్లేట్ యంత్రంను లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఆనందరావు మాట్లాడుతూ మహిళలందరూ స్వయం ఉపాధి ద్వారా ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి మహిళ పొదుపును పాటిస్తూ సమాజంలో ఆదర్శంగా ఎదగాలని ఆకాంక్షించారు.మరో ముఖ్య అతిథి రవీంద్ర బాబు మాట్లాడుతూ మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ వారికి ఇచ్చిన మాట ప్రకారం పేపర్ ప్లేట్ యంత్రానికి సమకూర్చడం జరిగిందన్నారు. దీనిని లబ్ధిదారులు చక్కగా ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న రజని, సభ్యులను ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానిక సర్పంచ్ తిరుకోటి సుజాత, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు మండలిక సుబ్రహ్మణ్యం శర్మ (దత్తుడు), స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతర ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ

18 నుంచి పాళమ్మ జాతర

ప్రజాశక్తి- మామిడికుదురు

ఈదరాడ గ్రామ దేవత శ్రీ పాళమ్మ అమ్మవారి జాతర ఈనెల 18 నుంచి 21 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ సాధనాల సుబ్బారావు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 18న సాయంత్రం అమ్మవారి జాతర నిర్వహిస్తారన్నారు. 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 21న నైవైద్యాలు సమర్పిస్తారన్నారు. తీర్థ మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. జాతర మహోత్సవాలకు సంబంధించి పోస్టర్లు, కరపత్రాలు ఆదివారం అమ్మవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆవిష్కరించారు.

ఘనంగా సీతారామ కల్యాణం

ప్రజాశక్తి - యంత్రాంగం

శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలో ఆదివారం సీతారామ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు.

ఆత్రేయపురం: మండలం లోని బొబ్బర్లంక గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. **కపిలేశ్వరపురం:** మండలంలో కపిలేశ్వరపురం, అంగర, వల్లూరు, తాతపూడి, వెదురుమూడి, మాచర, కాలేరు, నేలటూరు, కోరుమిల్లి, కేదార్ లంక తదితర గ్రామాల్లో సీతారామకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. **ఆలమూరు:** మండలంలోని మడికి శివారు చిలకలపాడులో ఆదివారం జరిగిన శ్రీరామనవమి వేడుకలలో రామాలయం వద్ద అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు.